రణభేరి మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-అనంతగిరి: ఉపాధ్యాయ రంగ సమస్యలపై యుటిఎఫ్ రణభేరి జీపుజాత కార్యక్రమం ముగింపు సందర్భంగా ఈనెల 25వ తేదీన గుంటూరులో జరిగే భారీ బహిరంగ సభకు హాజరై విజయవంతం చేయాలని ఆ సంఘం నేతలు కోరారు. మండలంలోని అనంతగిరి, పినకోట, పెద్ద బిడ్డ, బొర్రా స్కూల్ కాంప్లెక్స్ ల పరిధిలో పోస్టర్లను అల్లూరి జిల్లా యుటిఎఫ్ కార్యదర్శి పుడిగి.దేముడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ సమస్యలు పరిష్కారం చేయడంలో విఫలం అవుతున్నాయని, అందుకు నిరసిస్తూ పెద్ద ఎత్తున పోరాట ఉద్యమాలకు యుటిఎఫ్ పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నేతలు

హైడ్రో పవర్ ప్రాజెక్టులను విరమించుకోవాలి

ఆదివాసీ గిరిజన సంఘం



గిరిజనులతో మాట్లాడుతున్న బాలదేవ్

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: అల్లూరి జిల్లా ఆంధ్ర ఒడిశా సరిహద్దు మండలంలోని కండ్రుమ్ పంచాయితీ కంకటకత్ర గడ్డలో నిర్మించ తలపెట్టిన హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని విరమించుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్ డిమాండ్ చేశారు. హైడ్రో ప్రాజెక్టు నిర్మాణం తలపెట్టిన కంకటకత్ర గెడ్డలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా బృందం, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్, జిల్లా నాయకులు సురేష్ కుమార్ మండల కార్యదర్శి టీ సూర్యనారాయణ, జకారవలస గ్రామస్థులతో కలిసి ప్రాజెక్టు పరిశర ప్రాంతాన్ని శనివారం పరిశీలించారు. అనంతరం ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి టీ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాలదేవ్ మాట్లాడుతూ, ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతం కంకడకత్ర గెడ్డలో గతంలో విద్యుత్ ప్రాజెక్టు కోసం సర్వేలు చేశారన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నవయుగ, అదానీ బడా కార్పోరేట్ కంపెనీలకు అల్లూరి సీతారామరాజు జిల్లాలో 30 కేంద్రాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఒప్పందాలు చేసుకుని, జీఓ నెంబర్ 51 జారీ చేసిందని చెప్పారు .కంకడకత్ర గడ్డలో హైడ్రో పవర్ ప్రాజెక్టు డ్యామ్ నిర్మాణం చేపడితే కంద్రుమ్ పంచాయితీ ఒంబీ, దొరగుడ,సెందెరిగూడ, సర్రాయి, జోడిగూడ, జాకారవలస, కొర్రగూడ, నాగసంపెంగి గూడ తోపాటు కురిడి పంచాయితీలో గదబబగలుంగు, బల్యగుడ, పుట్టబంధ, నిమ్మగడ్డ, పెద్దచంప, పుట్టబంధకోలని, పిత్తమరిగూడ, గోరాపూర్, ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా పాడవా బ్లాక్ లో చాటువా, తొలుగుడ, దొరగుడ, చాటువాగేటు, కుంబిగుడ, మండిపోదోర్, పింపోల్ గుడ, అమ్ గూడ, బిల్లాపుట్, బంక్ బంజోడా గ్రామాల్లోని 1156 కుటుంబాలు ఉండగా, 5 వేలమంది జనాభా నిరశ్రాయులవుతారన్నారు. దీంతోపాటు 3 వేల ఎకరాల జిరాయితీ భూములు, వేల ఎకరాల అటవీ భూములు, కాఫీ, మిరియాల తోటలు, ఔషధ మొక్కలు వన్యప్రాణులు జలసమాధి అవుతాయని చెప్పారు. తక్షణమే ఈ ఒప్పందాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ పర్యటనలో జకరవాలస గ్రామస్థులు కిముడు రామచందర్, పరాన్న ,సద్దు తదితరులు పాల్గొన్నారు.



దహనం చేస్తున్న నాయకులు

జిఒ 51 ప్రతులు దహనం

ప్రజాశక్తి హుకుంపేట : మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద పిసా మండల పోరం ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమావేశంలో హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తీర్మానం చేశారు. ప్రభుత్వం ఏకపక్షంగా విడుదల చేసిన 51వ జీఓను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా పోరాట కమిటీ కో-కన్వీనర్ తాపుల కష్ణరావు మాట్లాడుతూ పిసా గ్రామసభల అనుమతి లేకుండా 5వ షెడ్యూల్ ప్రాంతంలో ప్రాజెక్టులు చేపట్టడం గిరిజన హక్కుల ఉల్లంఘన అని పేర్కొన్నారు. ప్రభావిత గ్రామాల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. తరువాత ఎంపిడివో కార్యాలయం ఆవరణలో జీఓ ప్రతులను దహనం చేసి, హైడ్రో పవర్ ప్రాజెక్టు రద్దు చేయాలి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పి. శంకర్, జె. వెంకటరావు, ఎస్. కీర్తన, ఎం. రామకష్ణ, పి. చిరంజీవి పాల్గొన్నారు.

జీపుజాతాను జయప్రదం చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి-చింతపల్లి : హైడ్రో పవర్ ప్రాజెక్టుల రద్దు చేయాలని కోరతూ సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 26 వరకు జరుగు జీపు జాతాను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్యపడాల్ పిలుపునిచ్చారు. సిపిఎం మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్, గొల్లూరి రాంబాబుతో కలిసి చింతపల్లిలో జీపు జాతా రూట్ మ్యాప్ కరపత్రాలను శనివారం చిన్నయ్యపడాల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన హక్కులు భారత రాజ్యాంగంలో అంతర్భాగమని పేర్కొన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల హక్కులను కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెడుతున్నాయని విమర్శించారు. ఈ నెల 22న అరకు నియోజకవర్గం, దుప్పిలవాడ పంచాయతీ బూసికొండలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాధం జీపు జాతాను ప్రారంభిస్తారన తెలిపారు. 27న హుకుంపేట మండలం మజ్జివలసలో అరణ్య గర్జన బహిరంగ సభతో జాతా ముగియనుందని పేర్కొన్నారు. బహిరంగ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. సుమారు 10 వేల ఎకరాల అటవీ, వ్యవసాయ భూములు కార్పొరేట్ కంపెనీలకు కేటాయించడంతో 250 గ్రామాలు, 50 వేల మంది ఆదివాసీలు, కాఫీ, మిరియాలు వంటి పంటలు జల సమాధి అవనున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అనుమతితో ఏజెన్సీ అడవుల్లో సరిహద్దు సర్వే పనులు జరుగుతున్నాయని, పోలీస్ పికెటింగ్‌తో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. అడుగడుగునా రాజ్యాంగ స్ఫూర్తిని ధిక్కరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలను జల సమాధి చేయొద్దని కోరతూ జరుగు జీపుజీతా, బహిరంగసభలను జయప్రదం చేయాలని కోరారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న చిన్నయ్యపడాల్

ఆదివాసీ నిరుద్యోగుల అక్రమ అరెస్టులను ఖండించండి

-సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు, 100శాతం రిజర్వేషన్ డిమాండ్‌పై శాంతియుత ఆందోళనలు చేస్తున్న ఆదివాసీ నిరుద్యోగులపై అక్రమ అరెస్టులను సీపీఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి అప్పల నరస శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఆదివాసీ యువత ఏజెన్సీ ప్రాంతాల్లో స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, గిరిజన ఉద్యోగాల్లో 100శాతం రిజర్వేషన్ కల్పించాలని న్యాయబద్ధంగా కోరుతూ సాలూరులో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద శాంతియుతంగా ముట్టడికి వెళ్లారన్నారు. అయినప్పటికీ అక్రమంగా అరెస్టు చేయడం, నిర్బంధించడం అత్యంత దారుణమైన చర్య అన్నారు. ఈ అక్రమ అరెస్టులతో ఆదివాసీల రాజ్యాంగబద్ధ హక్కులను కాలరాసే చర్యగా భావిస్తున్నామన్నారు. గిరిజనుల ఉపాధి అవకాశాల కోసం చట్టబద్ధంగా జరిగే ఆందోళనలను అణచి వేయడం ప్రజాస్వామ్య విరుద్ధమైన చర్య అని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్‌ను తక్షణమే విడుదల చేయాలన్నారు. ఆదివాసీ యువతపై అక్రమ కేసులను ఉపసంహరించి, నిర్బంధించిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఆదివాసీల హక్కుల కోసం, వారి ఉపాధి అవకాశాల కోసం సీపీఎం ఎల్లప్పుడూ పోరాడుతుందన్నారు.



కుండిలో నీటిని తోడుతున్న మహిళలు

కలుషిత నీరే గతి

-మరమ్మతుకు నోచని తాగునీటి పథకం

-అవస్థలు పడుతున్న గిరిజనులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఆంధ్ర ఒడిశా సరిహద్దు గ్రామం.. మండలంలోని కురిడి పంచాయితీ పితమరిగూడలో తాగునీటి సమస్యతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. తప్పని పరిస్థితిలో సుమారు కిలోమీటర్ల దూరంలో గల చటువ గెడ్డలో నిర్మించిన కుండీలోని నీటిని సేకరించి ఉపయోగిస్తున్నారు. గ్రామంలో తాగునీటి పథకం మరమ్మతుకు గురవడంతో గ్రామస్తులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చటివ గెడ్డలోని కుండి నీటిని సేకరిస్తున్నప్పటికీ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అక్కడి నీరంతా బురద మయంగా మారి కలుషితం అవుతోంది. ఆ నీటిని ఉపయోగిస్తున్న తాము వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి పథకాన్ని మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకోవాలని పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోయాయి. తక్షణమే అధికారులు స్పందించి తాగునీటి సౌకర్యాన్ని పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.




కురుస్తున్న వర్షం

అరకులోయలో కుండపోత వర్షం

అరకులోయ: పర్యాటక కేంద్రమైన అరకులోయ పరిసర ప్రాంతాల్లో శనివారం సాయంత్రం కుండ పోత వర్షం కురిసింది. ఉదయం తీవ్రమైన పొగ మంచు మధ్యాహ్నం ఎండ కాయడంతో స్థానికులు పర్యాటకులు ఎండ వేడిమి తట్టుకోలేక ఉక్కిరి బిక్కిరి అయ్యారు. సాయంత్రం భారీ వర్షం కురవడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. సుమారు రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో పర్యాటకులు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గిరిజన రైతులు మాత్రం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అరకులోయ, అనంతగిరి, విశాఖ ప్రధాన రహదారి అయిన ఘాట్ రోడ్లలో కూడా కుండ పోత వర్షం కురవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. శనివారం నుంచి దసరా సెలవులు ఇవ్వడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రోడ్లపై వర్షపు నీరు నిండి ప్రయాణికులు వానచోదకులు ఇబ్బందులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారి సుధాకర్, ఉద్యాన అధికారి ప్రియాంక, మండల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పరికరాల పంపిణీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: స్మార్ట్ లక్కీ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో మండలం లోని పూలుగూడా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం గిరి విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్టును పంపించేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధి కృప సింధు ఆశ్చర్య మాట్లాడుతూ విద్యార్థులు చదువుతూపాటు క్రీడా స్ఫూర్తిని కూడా పెంపొందించుకోవాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో సుమారు పది పాఠశాలలో విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లను పంపిణి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు స్టేట్ వైస్ ప్రెసిడెంట్ రమేష్ పట్నాయక్, జిల్లా సెక్రటరీ అప్పలరాజు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, విద్యా కమిటీ చైర్మన్ బలరాం, విద్యార్థులు పాల్గొన్నారు.



పరికరాలను ఇస్తున్న ప్రతినిధులు

రాయితీ పరికరాలపై అవగాహన

ప్రజాశక్తి -హుకుంపేట: మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో సిబ్బందికి సూక్ష్మ నీటి పారుదల (డ్రిప్) ఇరిగేషన్ రాయతీ పరికరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఉద్యాన అధికారి ఏ. రాజశేఖర్ మాట్లాడుతూ, రైతులు సూక్ష్మ నీటిపారుదల (డ్రిప్ ఇరిగేషన్) వినియోగం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. పంటల ఉత్పాదకత పెరిగి నీటి వనరులు ఆదా అవుతాయని చెప్పారు. రైతులు ఈ పద్ధతిని తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు సూక్ష్మ నీటిపారుదల (డ్రిప్ ఇరిగేషన్) ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి రైతులకు అందించే సదుపాయాలు, ప్రయోజనాలు, అమలు విధానంపై వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ



మాట్లాడుతున్న ఉద్యానవన అధికారి

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

- యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ డిమాండ్
- ఎపి జెన్‌కో ఎస్ఇ కార్యాలయం ఎదుట ఆందోళన
- సిఐటియు గౌరవ అధ్యక్షులు ఎస్కే సుభాన్ ఆధ్వర్యంలో ఎస్ఇకి వినతి

ప్రజాశక్తి -సీలేరు: ఎపి జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల్లో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రాష్ట్రప్రభుత్వం తక్షణమే రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు బి.లక్ష్మణ్, విష్ణుమూర్తి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జికె వీధి మండలం సీలేరు ఎపి జెన్‌కో ఎస్ఇ కార్యాలయం ఎదుట శనివారం కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన చేపట్టారు. 'కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి' 'సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి' నినాదాలు చేశారు. అనంతరం సీలేరు కాంప్లెక్స్ ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి సిఐటియు గౌరవ అధ్యక్షులు ఎస్కే సుభాన్ ఆధ్వర్యంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు విలేకరులతో మాట్లాడుతూ ఎపి జెన్‌కో, ట్రాన్స్‌కోలో పనిచేసే ప్రతి కాంట్రాక్ట్ కార్మికునికి 2022 పిఆర్‌సి ప్రకారం వేతనాలు, ఎరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు చేపట్టి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. పది సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసిన వారికి 2018 లో ఇచ్చిన విధంగా ఇన్సెంటివ్ ఇవ్వాలని గతంలో మాదిరిగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి విడిఎ ఇవ్వాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్ పది లక్షల రూపాయలకు తగ్గకుండా ఇవ్వాలన్నారు. సీలేరు, డొంకరాయి విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న 82 మంది కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతినెలా సకాలంలో బిల్లులు పెట్టకపోవడం వలన జీతాలు అందక అనేక ఇబ్బందులు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హెల్త్ కార్డులు ప్రతి ఒక్కరికి అందజేయాలని, మాచ్ ఖండ్, వనకఢిల్లీ, జోలాపుట్ ప్రాజెక్టులో ప్రస్తుతం 11 మంది కాంటాక్ట్ కార్మికుల పీస్ వర్కర్లుగా కొనసాగుతున్నారని వారికి జీవో 167/129 ప్రకారం పీస్ వర్క్‌ను రద్దుచేసి మెన్‌పవర్‌గా గుర్తించాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులు పాంగి సురేంద్ర అకాల మృతితో అతని భార్య చంద్రాకు కాంట్రాక్ట్ కార్మికునిగా నియమించి ఐదు నెలల నుంచి వేతనం ఇవ్వడం లేదని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.రమణ, కాంట్రాక్ట్ కార్మికులు ఎపి జెన్కో సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘ నాయకులు

మోతుగూడెం: మోతుగూడెం ఎపి జెన్‌కో సంస్థలో పనిచేస్తున్న సుమారు 120 మంది కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని మోతుగూడెం ఎపి జెన్‌కో చీఫ్ ఇంజనీర్ కార్యాలయం వద్ద సిఐటియు (యుఇఇయు) ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన విధంగా, కాంట్రాక్ట్ కార్మికులకు కోటి రూపాయలు బీమా పథకాన్ని అమలు చేయాలని హెల్త్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ కమిటీ సభ్యులు చింతా రాంబాబు, రీజనల్ కోశాధికారి బీవీ రమణ, కాంట్రాక్ట్ కార్మికులు రీజనల్ ట్రజరర్ సన్యాసిరావు, బ్రాంచ్ ప్రెసిడెంట్ ప్రేమ్‌సన్ పాల్గొన్నారు.



మోతుగూడెం ఎపి జెన్‌కో చీఫ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద ధర్నాచేస్తున్న కార్మికులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

రణభేరి సభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విఆర్‌పురం: ఈ నెల 25న విజయవాడలో జరిగే రణభేరి సభను జయప్రదం చేయాలంటూ సోములగూడెం, జెడ్పిహెచ్ఎస్ విఆర్‌పురం పాఠశాలల్లో శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు కె.వెంకట్, కార్యదర్శి జగదీష్ మాట్లాడారు. విఆర్ పురం మండల కమిటీ సభ్యులు అజయ్, రామకృష్ణ, యుటిఎఫ్ జిల్లా అడిట్ సభ్యులు డివివి సత్యనారాయణ మండల యుటిఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆదికర్మయోగి సేవా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- కొయ్యూరు:

ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో గిరిజనులకు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆదికర్మయోగి అభియాన్ కార్యక్రమం చేపట్టినట్లు కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం పంచాయతీ సర్పంచ్ పీటా సింహాచలం, కార్యదర్శి మోనిక తెలిపారు. రాజేంద్రపాలెం పంచాయతీలో ఆదికర్మయోగి సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమం ద్వారా గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని కొండపల్లి గ్రామంలో శనివారం ఆదికర్మయోగి అభియాన్ సేవా కేంద్రం సర్పంచ్ కుంజం జగన్నాథం,సేవా కేంద్రం ఇంచార్జ్ కుంజం ఆనందప్రసాద్ ప్రారంభించారు. సర్పంచ్ జగన్నాథం మాట్లాడుతూ.ఈ సేవా కేంద్రం ద్వారా పివిజిటీ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ఉపయోగంగా ఉంటుందన్నారు. గ్రామస్తులు ఏవైనా సమస్యలు ఉంటే తెలియజేస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హేమాశ్రీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే పర్యటన

ప్రజాశక్తి - విఆర్‌పురం: మండలంలోని వడ్డేగూడెం పంచాయతీ పరిధిలోని బిసి కాలనీలో సబ్ కలెక్టర్ చింతూరు ఐటిడిఎ పిఒ శుభం నొక్వాల్, ఎంపిపి కారం లక్ష్మి, జెడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి పర్యటించారు కాలనీవాసులు పలు సమస్యలు వారి దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టు నష్ట పరిహారానికి సంబంధించిన స్ట్రక్చర్ వేల్యూ నోటీసులు ఇచ్చి సమస్యను త్వరగా పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందించారు. స్పందించిన ప్రాజెక్టు అధికారి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సరస్వతి, ఎంపిడిఒ ఇమాన్యుయెల్, సర్పంచ్ సోడి నరసమ్మ, సిపిఎం నాయకులు కమ్మ చిచ్చు సత్యనారాయణ, టిడిపి నాయకులు ఆసంటి శీను, సిద్దు, అచ్చిరాజు, వైసిపి నాయకులు వైసిపి ఆర్టిఐ విభాగం జిల్లా అధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ ఉపసర్పంచ్ కోట్ల శ్రీనివాస్, వార్డు సభ్యులు ప్రసన్న శంకర్ శ్రీను, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్ శుభం నొక్వాల్‌కు సమస్యలు తెలుపుతున్న గ్రామస్తులు

నేటి నుంచి మావోయిస్టుల వారోత్సవాలు

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి -సీలేరు:

మావోయిస్టుల ఆవిర్భావ దినోత్సవాలు ఈ నెల 21 నుంచి 27 వరకూ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో పోలీసులు అప్రమత్తమై మావోయిస్టు నుంచి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. సీలేరు పరిసర ప్రాంతాల్లో సిఆర్పిఎఫ్, సివిల్ పోలీస్ బలగాలని మోహరించి ఎస్ఐ రవీంద్ర తనిఖీలు ముమ్మరం చేశారు. ఎపి జెన్కో చెక్‌పోస్టు రామాలయం సెంటర్, ఐటిఐ జంక్షన్‌లో వాహనాలను తనిఖీ లు చేశారు. సిఆర్‌పిఎఫ్ అవుట్ పోస్టు భద్రత కట్టుదిట్టం చేశారు. మావోయిస్టు ఆవిర్భావ దినోత్సవాలు ముగిసే వరకు నైట్‌సర్వీస్ బస్సులు రద్దు చేయాలని ఆర్టిసి అధికారులకు పోలీసులు ఆదేశించారు. ఆదివారం రాత్రి నుంచి నైట్‌సర్వీస్ బస్సులు ఆర్టిసి అధికారులు రద్దు చేశారు.



వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

రైతులకు ఎరువుల పంపిణీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి పిఎసిఎస్ ఆధ్వర్యంలో శనివారం సొసైటీ అధ్యక్షులు ముప్పన డింబకేశ్వరరావు శనివారం ఎరువులు పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షులు కేశవ్ మాట్లాడుతూ రైతులు తమకు కావాల్సిన యూరియా, పొటాష్, జింకు, వేపపిండి సబ్సిడీ ధరలకు పొందవచ్చునని సూచించారు. ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకాలు జిరాక్స్ కాపీలు తీసుకొచ్చి ఎరువులు పొందాలని సూచించారు. పూర్తిస్థాయిలో యూరియా రైతులకు అందుబాటులో ఉందని తెలిపారు. ఎరువుల గురించి ఆందోళన చెందాల్సిన పనిలేదని, సరిపడినంత ఎరువులు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షులు, టిడిపి నేత గణజాల తాతారావు, ఎఎంసి డైరెక్టర్ మాణిక్యం, కూటమి నేతలు అనుదీప్ పాల్గొన్నారు.



ఎరువులు అందిస్తున్న పిఎసిఎస్ అధ్యక్షులు డింబకేశ్వరరావు



ఆర్థికసాయం చేస్తున్న సర్పంచ్ చిట్టమ్మ తదితరులు

కిరాణాషాపు దగ్ధం

ప్రజాశక్తి -అడ్డతీగల : అడ్డతీగల పంచాయతీ అనిగేరు ముర్ల పాపయమ్మ కిరణాషాప్ దగ్ధమైంది. విషయం తెలుసుకుని అడ్డతీగల సర్పంచ్ పపులు చిట్టమ్మ, వైస్ సర్పంచ్ ముప్పనశెట్టి శ్రీను, ఎంపిటిసి వడ్లమూరి రత్నం, అనిగేరు నెంబరు అమ్మోజి, రెవెన్యూ సిబ్బంది విఆర్ఒ రాజేశ్వరి, రాధయ్య, సచివాలయం సెక్రటరీ పద్మ వైసిపి కార్యకర్తలు నాయకులు పరామర్శించారు. సర్పంచ్ చిట్టమ్మ, వైస్ సర్పంచ్ ముప్పన శెట్టి శ్రీను రూ.5వేలు, 25 కిలోలు బియ్యం అందించారు.



రికార్డులు పరిశీలిస్తున్న డిఎం హెచ్ఒ విశ్వేశ్వరనాయుడు

రోగులకు ఇబ్బంది లేకుండా చూడాలి

డిఎంఅండ్‌హెచ్ఒ విశ్వేశ్వర నాయుడు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: స్వచ్ఛంద్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని డుంబ్రిగూడ, కిల్లోగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా డిఎంఅండ్ హెచ్ఒ విశ్వేశ్వర నాయుడు శనివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్సీల పరిసరాలను పరిశీలించారు. పిహెచ్‌సి పరిసరాలను ఎప్పటి కప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, హాస్పిటల్ కు వచ్చే వ్యాధిగ్రస్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇమునిజేషన్ అధికారి సి చ్ కమల, వైద్యాధికారులు, పి రాంబాబు, నజీబ్, కుమార్ రత్న , పిహెచ్ ఎన్ జానకి ,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



అనంతగిరిలో టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

పశువులకు టీకాలు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని అనంతగిరి పంచాయతీ రాజుపాక గ్రామంలో మూగజీవాలకు పశు వైద్య శాఖ సిబ్బంది ఎస్ఎ శ్రీనివాస రావు శనివారం టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పశువుపాకలు గ్రామానికి దూరంలో ఉంచుకోవాలని, ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా చేయాలని సూచించారు. పశువులు, మేకలకు వ్యాధులు సోకిన వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని రైతులకు సలహా సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు జె. సింహాద్రి, జె. కుమార్, డి .లక్ష్మణ, సన్యాసి జె. చిన్నారావు తదితరులు పాల్గొన్నారు

డుంబ్రిగుడ: స్థానిక పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కురిడి పంచాయితీలో మూగజీవులకు గాలికుంటు వ్యాధి టీకాలను వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిని మాట్లాడుతూ, ఈ సీజన్లో పశువులు మేకల తోపాటు ఇతర మూగజీవులకు ఎటువంటి వ్యాధులు సపకుండా ఉండేందుకుగాను ముందస్తు చర్యగా ప్రతి గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి టీకాలు వేస్తున్నట్లు ఆమె చెప్పారు. మూగజీవులకు ఎటువంటి వ్యాధులు ప్రబలిన వెంటనే స్థానిక ఏ హెచ్ ఏ లని సంప్రదించి వైద్య సేవలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓఎస్ఎస్ సుబ్బారావుచ ఏహెచ్ఎలు అప్పారావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంబాలకొండపై గీతం విద్యార్థుల ట్రెక్కింగ్

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ బయోటెక్నాలజీ విభాగం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శనివారం కంబాలకొండలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌విజి.రెడ్డి ఆధ్వర్యంలో వాలంటీర్లు కంబాలకొండ లో ట్రెక్కింగ్, మొక్కలు, ఔషధ మొక్కల గురించి పరిశీలించారు. విద్యార్థులు రిస్క్ ట్రెక్కింగ్, ఫిజికల్, మెంటల్ హెల్త్ గురించి నేర్చుకున్నారు. వాతావరణంలో మార్పులు, జంతువుల గురించి తెలుసుకున్నారు. బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ఐ.శరత్‌బాబు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థులలో సామాజిక బాధ్యత పెరుగుతుందన్నారు. వాలంటీర్లను గీతం స్కూల్ అఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్.గోపీనాథ్, డాక్టర్ కెవి.నారాయణ, సాయిబాబా పాల్గొన్నారు.

డ్రాపౌట్స్ లేకుండా చూడాలి



హుకుంపేటలో రికార్డులు పరిశీలిస్తున్న డిఇఒ

జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మజీ

ప్రజాశక్తి-యంత్రాంగం

హుకుంపేట: మండలంలోని పెదగరువు స్కూల్ కాంప్లెక్స్, గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల, మత్స్యపురం పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మజీ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, విద్యుత్ సదుపాయాలు, విద్యార్థుల హాజరు శాతం, ఎస్ఏ-1 పరీక్షలకు సంబంధించిన అసెస్మెంట్ బుక్స్ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం, వసతి వంటి అంశాలపై తెలుసుకున్నారు. అనంతరం విద్యాశాఖ అధికారి బ్రహ్మజీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యా నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, విద్యార్థుల హాజరు శాతం పెంచడంలో శ్రద్ధ చూపాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను తప్పనిసరిగా విద్యార్థులకు చేరేలా చూడాలని చెప్పారు. భోజనాలు సమయానికి అందించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచి విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలని, విద్యతో పాటు క్రీడా రంగంలోనూ విద్యార్థులను ప్రోత్సహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పెదగరువు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. నిర్మ, మత్స్యపురం పాఠశాల ఉపాధ్యాయుడు సత్యారావు పాల్గొన్నారు.

పాడేరు టౌన్: అల్లూరు జిల్లా కేంద్రం పాడేరు మండలంలోని గురుపల్లి ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలను డిఇఒ బ్రహ్మజీరావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ప్రత్యేక తరగతులను నిర్వహించాలని అన్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఎధ్యాహ్న భోజన నాణ్యతపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యతతో మెనూ ప్రకారం అందించాలని ఆదేశించారు. డిఇఒ వెంట మండల విద్యాశాఖాధికారి మోరి జాన్ ఉన్నారు.

డుంబ్రిగుడ:- పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్స్ లేకుండా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని డీఈవో బ్రహ్మజీ ఆదేశించారు. స్థానిక మండల కేంద్రంలోని స్కూల్ కాంప్లెక్స్ లో ఆయన శనివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పాఠశాలలో విద్యార్థుల ఎన్రోల్మెంట్ తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎప్పటికప్పుడు మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలల సందర్శిస్తూ విద్యార్థుల హాజరు నమోదును పరిశీలించడంతోపాటు డ్రాప్స్ లేకుండా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఈఓ 2 జి గెన్ను, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి - యంత్రాంగం



అనంతగిరిలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

అనంతగిరి: మండలంలో మారుమూల వేంగడ పంచాయితీ ప్రాథమిక ఆరోగ్య సబ్ సెంటర్ లో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ వైద్య శిబిరం లంగుపర్తి ఆసుపత్రి డాక్టర్ పి.మంజుభార్గవి ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక జడ్పిటిసి దీసరి. గంగరాజు హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని, మరింతా ఎక్కువ ఇబ్బందులు ఉన్నప్పుడు స్క్రీనింగ్ ద్వారా తెలుసుకొని వైద్యం పొందాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు కూడా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో జరిగే మెడికల్ కేంపుల్లో ఆశా వర్కర్లు,ఎ.ఎన్.ఎమ్స్ చైతన్యం కల్పించి వైద్యం పొందేలా అవగాహన పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేంగడ సర్పంచ్ సోడేపల్లి. సీమా .సివేరి.కొండలరావు, లంగుపర్తి ప్రాథమిక వైద్య కేంద్రం డాక్టర్ రాకేష్ పి. హెచ్.ఎన్.పి వెంకటలక్ష్మి..రాజారావు ఎంపి. హెచ్.ఒ సుశీల పాల్గొన్నారు

డుంబ్రిగుడ: స్వస్థ నారీ స్వసక్తు పథకంలో భాగంగా కిలోవ్ కూడా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఘసభ సబ్ సెంటర్లో శనివారం వైద్యాధికారి రత్న ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ వ్యాధులతో బాధపడుతున్న సుమారు 70 మంది వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి కుమార్ రత్న మాట్లాడుతూ ఎపిడమిక్ సీజన్ లో ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కాచి చల్లార్చిన నీటితోపాటు వేడి పదార్థాలను తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలోసర్పంచ్ పి సునీత,ఎంపిటీసీ,హెల్త్ అసిస్టెంట్ ఎస్ ప్రభాకర్, ఎం.ఎల్.హెచ్.పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



పాట సీడీని విడుదల చేస్తున్న జడ్‌పిటిసి కె బొంజుబాబు

గోమంగి మండల సాధన సమితి పాటల సీడీ విడుదల

ప్రజాశక్తి-పెదబయలు : గోమంగి మండల సాధన సమితి ఆధ్వర్యంలో రూపొందించిన ఉద్యమ గీతం సీడీని జెడ్‌పిటిసి కె.బొంజుబాబు శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17 పంచాయతీలను గోమంగి మండలం ఏర్పాటుతోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలసాధన సమితి నాయకులు కూడ బొంజుబాబు, పెదబయలు మాజీ ఎంపీపీ జర్సింగి సూర్యనారాయణ, సమితి అధ్యక్షులు చల్లంగి ఉమామహేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు ప్రసాద్, కార్యదర్శి కే పృథ్వీరాజు, సర్పంచ్‌లు జమ్మనాయుడు, భాస్కరరావు, సత్యబాబు ఇతర నాయకులు పాల్గొన్నారు.

యూనిఫాం సరిగా కుట్టించని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-పెదబయలు : మండలంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో బాలికలకు యూనిఫారం దుస్తులు సరిగా కుట్టించని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సీతాగుంట పంచాయతీ వార్డు సభ్యులు కిముడు రాజు డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సిబ్బంది బాలికల డ్రస్ జతకు రూ.600 నుండి రూ.700 వరకు అక్రమంగా వసూలు చేసి, తామే కుట్టించి దుస్తులు ఇస్తామని చెప్పారని తెలిపారు. కాని కొలతలు సరిపడా లేని లూజుగా, టైట్‌గా కుట్టిన దుస్తులు పంపిణీ చేసిన సిబ్బందిపై ఉన్నత అధికారులు శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి-చింతపల్లి : పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం, మొక్కలు నాటుతూ పచ్చదనం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని చింతపల్లి అటవీ రేంజ్ అధికారి ఎస్.వెంకటరావు, సెక్షన్ ఆఫీసర్ ఎం.సింహాచలం పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా 'స్వచ్ఛ దివాస్' కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. చింతపల్లి డివిజన్ కార్యాలయం, ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బోడకొండమ్మ ఆలయం వద్ద అటవీ అధికారులు, సిబ్బంది పరిశుభ్రత పనులు చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు వరహాలు బాబు, వినోద్ కుమార్, ఇతర అటవీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెదబయలు : స్వచ్ఛ భారత్‌లో భాగంగా మండల కేంద్రంలో శనివారం ఉదయం సిఆర్‌పిఎఫ్ 198 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సర్యాన్ రాజు ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డు, అంబేద్కర్ కూడలి, పార్కు ఆవరణలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. కార్యక్రమంలో సిఆర్‌పిఎఫ్ సిబ్బంది, వైసిపి నాయకులు జి.సూరయ్య పాల్గొన్నారు.



చింతపల్లిలో మొక్కను నాటుతున్న అధికారులు

ఏజెన్సీలో భారీ వర్షం

ప్రజాశక్తి -చింతూరు: మండలంలో శనివారం ఉరుములు మెరుపులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుండి విపరీతమైన ఎండకు ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రం 3 గంటలకు ఒక్కసారిగా వాతావరణం చల్లబడి భారీవర్షం కురియడంతో ఊరట చెందారు.

వాహనదారుల వద్ద తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలి

ప్రజాశక్తి-కొయ్యూరు: మండలంలోని గ్రామదర్శినిలో భాగంగా కొయ్యూరు ఎస్ఐ కిషోర్‌వర్మ నడింపాలెం వంచాయతీ శివారు గ్రామమైన గాంకొండ, బట్టపనుకుల పంచాయతీ గన్నర్లపాలెంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో ప్రధాన సమస్యలు అడిగి తెలుసుకు న్నారు. యువత బాగా చదువుకోవాలని సూచించారు. వాహనదారులు అంతా విధిగా లైసెన్స్ కలిగి ఉండాలని లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.



నాగేశ్వరరావును పరామర్శిస్తున్న సిపిఐ నాయకులు

నాగేశ్వరరావుకు పరామర్శ

ప్రజాశక్తి - కూనవరం : సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు భార్య అచ్చమ్మ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. శనివారం ఆయనను సిపిఐ నాయకులు సూర్యచంద్రరావు, సాక్షి బాబురావు, అశోక్, సూరం వెంకటేశ్వర్లు కలిసి పరామర్శించారు.

12న వైజాగ్ హాఫ్ మారథాన్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ ట్రైల్ రన్నింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 12న వైజాగ్‌హాఫ్‌మారథాన్ నాలుగో ఎడిషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రేస్ డైరెక్టర్ డాక్టర్ కె.కృష్ణచైతన్య తెలిపారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో మారథాన్‌కు సంబంధించిన టీషర్ట్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గీతం కళాశాలనుంచి ఈ మారథాన్ కార్యక్రమం ప్రారంభమవు తుందని, ఈ పోటీలో 21కే,10కే, 5కే, 3కే పేరిట పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం నగదు బహుమతి రూ.3 లక్షలు ఇవ్వనున్న ట్లు తెలిపారు. పోటీలో ఆసక్తి ఉన్న వారు ముందుగా తమ పేర్లను www.vtra.run ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమనికి అసోసియేట్ స్పాన్సర్‌గా ఐడిబిఐ బ్యాంక్ డెకథలాన్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు యోగేష్, రవి, శ్రీరామ్, యశ్వంత్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఏజ్ కేర్ ఫౌండేషన్ సేవలు అమోఘం

- రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి

ప్రజాశక్తి -విశాఖకలెక్టరేట్ :
ఏజ్ కేర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని రోటరీ క్లబ్ 3020 డిస్టిక్ గవర్నర్ డాక్టర్ వై.కళ్యాణ్‌చక్రవర్తి కొనియాడారు. గంభీరంలో నూతనంగా నిర్మించిన భవనాన్ని శనివారం ఆయన సందర్శించారు. రోటరీక్లబ్ గ్రేటర్ విశాఖ ఆధ్వర్యంలో రూ.22 లక్షల విలువైన వీల్‌చైర్లు, ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్స్‌లను ఫౌండేషన్‌కి అందజేశారు. ఫౌండేషన్ ఫౌండర్ ట్రస్టీ డాక్టర్ ఎస్.ఎస్.రాజు మాట్లాడుతూ త్వరలో ఏజ్‌కేర్ ఫౌండేషన్ సేవలను పూర్తిస్థాయిలో అందిస్తామన్నారు. మరిన్ని కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో చింతా నేతాజీ, సెక్రటరీ పి. భాస్కర్‌నరేంద్ర జగన్, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సిహెచ్ కిషోర్ కుమార్, పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ బచ్చు బ్రహ్మానందం పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మొక్కలు నాటుతున్న సబ్‌కలెక్టర్ శుభంనొక్వాల్



సీలేరు : ప్రతిజ్ఞ చేస్తున్న ఇంజనీర్లు కార్మికులు, కాంటాక్ట్ కార్మికులు

ప్రజాశక్తి-విఆర్‌పురం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఐటిడిఎ పిఒ, సబ్‌కలెక్టర్ శుభంనొక్వాల్ సూచించారు. మండలం లోని బిసికాలని గ్రామంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. డ్రైనేజీ, రోడ్డు సమస్యలు తెలుసుకుని పరిష్కరించారు. అనంతరం ఎంపిపి కారంలక్ష్మి ఎంపిడిఒ ఇమ్మానుమెల్ మొక్కలు నాటారు. జెడిపిటిసి వాళ్ల రంగారెడ్డి, సర్పంచ్ సోడి నరసమ్మ, తహశీల్దార్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు. రేఖపల్లి పంచాయతీ ఎంపిడిఒ కార్యాలయం ప్రాంగణంలో ఎంపిపి మొక్కలు నాటారు.

సీలేరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎపి జెన్‌కో ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. జికె వీధి మండలం సీలేరు జల విద్యుత్ కేంద్రం ఎపి జెన్కో కాలనీ కార్యాలయాలు పరిసరాల్లో చెత్త తొలగించి శుభ్రం చేశారు. ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. ఇఇ రాజేంద్రప్రసాద్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: చినార్కూరు పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో ఎంపిపిఎస్ శ్రీరాంపురం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. సర్పంచ్ సున్నం అభిరామ్, పంచాయతీ సెక్రటరీ రోజా హెచ్‌ఎం కన్నారావు పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలోని డొంకరాయి గ్రామ ఎస్టి కాలనీ రోడ్డులో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి రఘుబాబు ఆధ్వర్యంలో రోడ్డుకి ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించారు. ఎంపిటిసి కరకా వెంకటరమణ, వార్డు మెంబెర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాడేరు: మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకుందామని జాయింట్ కలెక్టర్ ఎం.జె.అభిషేక్‌గౌడ్ సూచించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర కార్యక్రమంలో బాగంగా శనివారం పాడేరు మండలం కాడెలి పంచాయితీ గురుపల్లి గ్రామంలో డివిజనల్ పంచాయతీ అధికారి కుమార్ అధ్యక్షతన గ్రీన్ ఆంధ్రప్రదేశ్ పేరిట నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌తోపాటు టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి, ప్రాజెక్టు అధికారి తిరుమణి శ్రీపూజ, అసిస్టెంట్ కలెక్టర్ నాగ వెంకట సాహిత్ పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పాడేరు ఏజెన్సీలో అదనంగా లక్ష ఎకరాల్లో కాఫీ తోటల పెంపకానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గిడ్డి ఈశ్వరి, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్ మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ఐటిడిఎ పిఒ శ్రీపూజ మాట్లాడుతూ మొక్కలు నాటడంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో డ్వామా పి.డివిద్యాసాగర్, డివిజనల్ పంచాయతీ అధికారి పి.యస్.కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మజీరావు, సర్పంచ్ దొర పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని కాశీపట్నం పశువైద్య కేంద్రంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం స్థానిక పశువైద్య అధికారి సాగరి గణేశ్వరరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.



గురుపల్లిలో మొక్కలు నాటుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ్

వేతనాలు ఎస్‌బిఐ నుంచే చెల్లించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసిలో పనిచేస్తున్న 8 వేల మంది కార్మికుల ఖాతాలను ఎస్‌బిఐ నుండి యాక్సిస్ బ్యాంక్‌కు మార్చే ప్రసక్తి లేదని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు టి. నూకరాజు,ఉరికిటిరాజు, గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి స్పష్టం చేశారు. శనివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికుల అకౌంట్లను యాక్సెస్ బ్యాంకులోకి మార్చడానికి సిఐటియు వ్యతిరేకం అన్నారు. ఇటీవల జివిఎంసి ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో యాక్సిస్ బ్యాంక్ అధికారులు, జివిఎంసి అధికారులకు ఈ విషయాన్ని తెలియజేశామన్నారు. ప్రైవేట్ బ్యాంకులు ఇఎస్ఐ, ప్రావిడెంట్ ఫండ్, సంక్షేమ పథకాలు ఎలా చెల్లించగలవని ప్రశ్నించారు. ఇప్పటికే ఆప్కాస్‌తో చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రతినెల వందల మంది వేతనాలు పడటం లేదన్నారు. పెన్షన్లు నిలిపివేశారని,ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయటం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మారుమూల ప్రాంతాల్లో కూడా ఎస్‌బిఐ బ్రాంచీలు, ఎటిఎంలు ఉన్నాయని, ఆ నెట్‌వర్క్ యాక్సిస్ బ్యాంకుకు లేదన్నారు. జివిఎంసి అధికారులు తమ వైఖరిని మార్చుకోవాలన్నారు. ఎస్బిఐ నుండే జీతాలు ఇతర సంక్షేమ పథకాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డెత్ పోస్టులు రిటైర్మెంట్ పోస్టులు వెంటనే ఇవ్వాలని, మినిట్స్‌లో ఒప్పుకున్న ఒప్పందాలు వెంటనే అమలు చేయాలని, లేనియెడల నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు, ముద్దాడ వరప్రసాద్, జె.ఆర్‌నాయుడు ఆదినారాయణ, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎపి జెన్‌కో ఇఇ కార్యాలయం ముందు దీక్షలో పాల్గొన్న విద్యుత్ ఉద్యోగులు

విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

ప్రజాశక్తి -సీలేరు: విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చలని లేకుంటే రాష్ట్ర జెఎసి నాయకుల ఆదేశాలు మేరకు ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని విద్యుత్ ఉద్యోగుల జెఎసి చైర్మన్ వై.సత్తిబాబు, జెఎసి కన్వీనర్ వై. ధారారాజు హెచ్చరించారు. ఎపి జెన్కో ఇఇ కార్యాలయం ముందు శనివారం రెండో రోజు రిలే దీక్షలు కొనసాగించారు. దీక్షలో అయినాడు శివ, డి వెంకటేశ్వరరావు, ఎం.కృష్ణయ్య కాంట్రాక్ట్ కార్మికుడు అప్పలరాజు పాల్గొన్నారు. ఎపి జెన్కో అకౌంట్‌ఆఫీసర్ ఎంవివి.సత్యనారాయణ జెఎసి నాయకులు, కార్మికులు సంఘీభావం తెలిపారు. జెఎసి నాయకులు మాట్లాడుతూ విడతల వారీగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. ఈ నెల 22న శాంతియుతంగా విద్యుత్ ఉద్యోగుల ర్యాలీ నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎపి జెన్కో ఇంజనీర్లు కార్మికులు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

ఇగ్నో అడ్మిషన్ల గడువు పెంపు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) జూలై 2025 విద్యాసంవత్సరానికి గానూ వివిధ దూరవిద్యా కోర్సులతోపాటూ ఆన్లైన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం గడువును సెప్టెంబర్ 30వ తేదీ వరకూ పొడిగిస్తున్నట్టు సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. విశ్వవిద్యాలయం అందిస్తున్న అన్ని డిప్లొమా, పిజి డిప్లొమా, డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు సెప్టెంబర్ 30 వరకూ లభిస్తాయన్నారు. ఈ విద్యా సంవత్సరానికి ఇగ్నో అనేక రంగాల్లో యువతకు ఉపాధి అవకాశాలు పెంచే కొత్త కోర్సులను అందిస్తోంది. ఈ అడ్మిషన్లు ఆన్‌లైన్ ద్వారా పొందాల్సి ఉంటుంది. ఇగ్నో వెబ్‌సైట్‌లో ఉన్న అడ్మిషన్ల లింక్ https://ignouadmission.samarth.edu.in ద్వారా అడ్మిషన్లు పొందవచ్చునని ఆయన తెలిపారు. విశాఖపట్నం ప్రాంతీయకేంద్రం పరిధిలోని 11 జిల్లాల్లో ఉన్న అధ్యయన కేంద్రాలన్నిటిలో ప్రవేశాలు పొందే వీలుంది. ఫీజులు కూడా ఆన్లైన్ ద్వారానే చెల్లించాల్సి ఉంటుంది. ఎంపిక చేసిన డిగ్రీ కోర్సుల్లో ఎస్సి, ఎస్టి విద్యార్థులకు 50 శాతం ఫీజు రాయితీకూడా కల్పిస్తోంది. మరిన్ని వివరాలకు ఇగ్నో వెబ్‌సైట్ లేదా ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని ఈమెయిల్ ద్వారా సంప్రదించవచ్చు.

'మనువాద కార్పొరేట్ ఫాసిజం మూలాలు'పై 28న సదస్సు

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : మహాత్మా జ్యోతిబాపూలే సత్యశోధక్ సమాజ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా అలాగే సర్దార్ భగత్‌సింగ్ 118 జయంతి సందర్భంగా ఈనెల 28న అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో విశాఖపట్నం పౌరప్రజాసంఘాల వేదిక ఆధ్వర్యంలో 'మనువాద కార్పొరేట్ మూలాలు-ప్రజా ఉద్యమ కర్తవ్యాలపై సదస్సు నిర్వహిస్తున్నట్లు పౌరప్రజా సంఘాల సమన్వయకర్త పాత్రపల్లి చంద్రశేఖర్ తెలిపారు. శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సదస్సుకు సంబంధించి కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబాపూలే సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేశాడన్నారు. నేడు మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 12 ఏళ్లలో దేశప్రజల మధ్య మతవిద్వేషాలు రెచ్చగొడుతున్నారన్నారు. ఒకవైపు దేశ సంపదను అదాని, అంబానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారన్నారు. అడవుల్లో ఉన్న ఆదివాసీలను తరిమేసి అక్కడ ఉన్న విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నెయ్యల నాగభూషణరావు, చైతన్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు లలిత, ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ప్రతినిధి చలాన్, మానవ హక్కుల వేదిక ప్రతినిధి అనురాధ రామకష్ణ ,లక్ష్మీ తిరుపతిరావు,శివలక్ష్మి జయ తదితరులు పాల్గొన్నారు.